క్లుప్తంగా

క్షయపై అవగాహన కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ఓ

బుచ్చినాయుడుకండ్రిగ: క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సీహెచ్ఓ వేంకటేష్ తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆయన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధి ఉన్న వారికి ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేస్తుందని, వారికి ఖర్చులకు నెలకు రూ.500 చొప్పున ఆరు నెలలు ఇస్తుందని తెలిపారు.

కుల వివక్ష చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న డీటీ శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు వివక్ష చూపితే చట్టరీత్యా నేరమని డిప్యూటీ తహసీల్దార్ శివయ్య తెలిపారు. మంగళవారం మొక్కలచేను ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, పోలీసు శాఖ ఆధ్వర్యంలో గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అగ్రవర్ణాలు ఎస్సీ, ఎస్టీలను చిన్నచూపు చూడకూడదని, అలా చేస్తే చట్టరీత్యా నేరమని తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివక్షకు గురైతే తెలియజేయాలని తెలిపారు. ఎఓ త్రివిక్రమ్‌రావు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా స్కార్ఫ్ డే



హెచ్ఎం రాజేశ్వరికి స్కార్ఫ్ ధరింపజేస్తున్న స్కౌట్స్ సిబ్బంది

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్కార్ఫ్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరికి స్కార్ఫ్‌ను ధరింపజేశారు. అనంతరం హెచ్ఎం స్కార్ఫ్ ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల గైడ్స్ కెప్టెన్ సులోచన, జయశ్రీ, స్కౌట్స్ మాస్టర్ ఎస్కే అజారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



మోటారుకు మరమ్మతులు చేస్తున్న ఎలక్ట్రీషియన్

ఏర్పేడు: మండలంలోని ఎండీపుత్తూరులో సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో తాగునీటి మోటారుకు మరమ్మతులు చేయించారు. రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో మోటారు మరమ్మతులకు గురైంది. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ మోటారుకు మరమ్మతులు చేయించి, గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీనిపై గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

పింఛన్ల అందజేత



కంచనపుత్తూరులో పింఛన్ అందజేస్తున్న వలంటీర్

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో మంగళవారం వలంటీర్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేశారు. ఉదయం ఐదు గంటల నుంచి వలంటీర్లు పింఛన్ల నగదు పంపిణీ చేశారు. కంచనపుత్తూరు, కల్లివెట్టు, కనమనంబేడు, జీఎస్‌కండ్రిగ గ్రామా ల కార్యదర్శులు ఇందిరమ్మ, వేంకటేశ్వర్లు, శివకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో సాయంత్రంలోపు 96 శాతం పింఛన్లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఈశ్వరయ్యకాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మంగళవారం యంగ్ ఎంప్లాయీస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిదేవి సంస్థ అధ్యక్షుడు హేమకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు గోపి, కిరణ్, ఉపాధ్యాయురాలు శిరీష తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ విద్య



వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ బోర్డులపై పాఠ్యాంశాలను సాధన చేస్తున్న విద్యార్థులు



వరదయ్యపాళెం హైస్కూల్‌లో ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- బ్లాక్ బోర్డుల స్థానంలో డిజిటల్ బోర్డులు
- సాంకేతిక విద్యపై విద్యార్థుల పట్టు

వరదయ్యపాళెం: ప్రభుత్వ పాఠశాలల్లో చాక్‌పీస్‌లకు కాలం చెల్లనుంది. బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్‌లు అవసరం లేని డిజిటల్ బోధన అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు ఇప్పటివరకు తరగతి గదుల్లో ఏ పాఠ్యాంశం బోధించాలన్న ఉపాధ్యాయులు బ్లాక్‌బోర్డు, గ్రీన్ బోర్డులపై చాక్‌పీస్‌తో రాసి విద్యార్థులకు వివరించేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యత క్రమంలో ఆధునిక సదుపాయాల్లో భాగంగా విడతల వారీగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రభుత్వం డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. దీనికి అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

ఆ దిశగా వరదయ్యపాళెం మండలంలో మొదటి విడతలో వరదయ్యపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 13 తరగతి గదులకు డిజిటల్ బోర్డులను పంపిణీ చేశారు. అలాగే మండలంలోని గోవర్ధనపురం హైస్కూల్‌కు 4, అంబికాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు 3 బోర్డులను ప్రభుత్వం పంపిణీ చేసింది. వీటిని ఉపయోగించే విధానానికి సంబంధించి ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు తరగతి గదిలో అమర్చిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ) బోర్డుల ద్వారా విద్యను బోధిస్తున్నారు. ఏ కార్పొరేట్ స్కూళ్లలో కూడా ఇంతటి అధునాతన విధానం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు ఇంతటి సౌకర్యం కల్పించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం ఐఎఫ్‌పీ బోర్డుల ద్వారా బోధన సులభతరం కావడంతో పాటు విద్యార్థులు సైతం సులువుగా పాఠ్యాంశాలను అర్థం చేసుకోగలరని చెబుతున్నారు. విద్యా విధానంలో ఇది కొత్త ఒరవడిని తీసుకువస్తుందన్నారు.

బ్లాక్ బోర్డులకు స్వస్తి

ప్రభుత్వం విద్యలో ఆధునిక టెక్నాలజీకి అధిక ప్రాముఖ్యతనిస్తోంది. ప్రతి విద్యార్థికి పాఠం అర్థమయ్యేలా, మంచి విజ్ఞానం పొందేలా వనరులు సమకూర్చుతోంది. ఇప్పటివరకు చాక్‌పీస్‌లతో బ్లాక్ బోర్డుపై రాసే విధానానికి స్వస్తి పలికారు. ప్రస్తుతం ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో దీనిని అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మండలంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు రెండు రోజుల చొప్పున శిక్షణ పొందారు. ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ ప్రోగ్రామ్) కింద పాఠశాలలకు డిజిటల్ బోర్డులు అందిస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ ఇలా..:

డిజిటల్ విద్యలో ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించేందుకు వారికి కావల్సిన శిక్షణను ఇస్తున్నారు. ఇంటర్నెట్ అనుసంధానంతో ఉన్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డును ఏ విధంగా ఉపయోగించాలన్నది వివరిస్తున్నారు. ఇప్పటివరకు ఉపాధ్యాయుడు కొత్త విషయాన్ని విద్యార్థులకు చెప్పాలంటే సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని వివరించాల్సి వచ్చేది. ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కొత్త విధానంలో ఒక క్లిక్‌తోనే విద్యార్థులకు అన్ని విషయాలు చూపించవచ్చు. లెక్కలు, సైన్స్ పాఠ్యాంశాల బోధన సమయంలో కొన్ని బొమ్మలు వేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం వాటిని వీటిపై చేతితో వేయాల్సిన పని ఉండదు. గతంలో బోధించిన పాఠ్యాంశాలపై విద్యార్థులకు సందేహాలు ఉంటే వెంటనే దానిని బోర్డుపై ప్రదర్శించి సందేహాలు నివృత్తి చేయవచ్చు.



తరగతి గదిలో విద్యార్థులు

నూతన ఒరవడి:



విద్యా విధానంలో ఇదో నూతన ఒరవడి. ఐఎఫ్‌పీ ద్వారా విద్యాబోధన చేయడం వల్ల విద్యార్థులకు వాటిని గుర్తించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇప్పటివరకు బ్లాక్ బోర్డుపై చెప్పిన వాటిని ఈ విధానంలో చెబుతాం. ఎక్కువ కాలం విద్యార్థుల మదిలో పాఠాలు నిలిచిపోతాయి.

-మేఘనాథ్, పీఎస్ టీచర్, వరదయ్యపాళెం హైస్కూల్

సులభంగా వివరించవచ్చు:



ఐఎఫ్‌పీ విధానంలో విద్యార్థులకు కష్టతరమైన పాఠ్యాంశాలైన సులభంగా వివరించవచ్చు. దీనికి తోడు దృశ్య, శ్రవణంతో పాఠ్యాంశాలు బోధించడం ద్వారా విద్యార్థికి ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంది. మ్యాప్‌లు, చిత్రాల ద్వారా చూపించే కొన్ని అంశాలను నేరుగా ఫొటోలతో సహా చూపించడానికి వీలవుతుంది.

-కేఎస్ రాజు, మ్యాథ్స్ టీచర్, వరదయ్యపాళెం హైస్కూల్

ఆడుదాం ఆంధ్రను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నరసింహారావు

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రతి క్రీడాకారుడు ఆడుదాం ఆంధ్రను సద్వినియోగం చేసుకోవాలని, క్రీడాకారుల పాలిట వరమని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలు, పీడీలు, సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలన్నారు. అక్టోబరు 2 నుంచి సచివాలయాల స్థాయిలో ఖోఖో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి నగదు బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో ప్రతిభ ఉన్న వారిని వెలికి తీయడానికే ఆడుదాం ఆంధ్ర నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తహసీల్దారు భార్గవి, ఈఓపీఆర్డీ రాజశేఖర్ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని బసవయ్యపాళెంలో బుధవారం ఉదయం 11 గంటలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ భక్తవత్సలం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తొట్టంబేడు మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రా రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని పేర్కొన్నారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆలయాలకు నగదు విరాళాలు



అంకమ్మ ఆలయానికి నగదును అందజేస్తున్న దాతలు



విజయగణపతి ఆలయానికి నగదును అందజేస్తున్న దాతలు

ఏర్పేడు: మండలంలోని నచ్చనేరి, నాగంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఆలయాలకు మంగళవారం నగదు విరాళాలు అందజేశారు. నచ్చనేరికి చెందిన కైలాసం పద్మనాభరెడ్డి, వెంకటమ్మ, కుమారులు జనార్ధన్‌రెడ్డి, త్రినాథ్‌రెడ్డి, జయశంకర్‌రెడ్డి, బాబురెడ్డి నచ్చనేరిలో నూతనంగా నిర్మిస్తున్న అంకమ్మ ఆలయానికి రూ.2,02,116, నాగంపల్లిలో నిర్మిస్తున్న విజయగణపతి ఆలయానికి రూ.1,01,116 నగదును ఆలయాల కమిటీ సభ్యులకు విరాళంగా అందజేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మునిరామయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు వేగవంతం



మాట్లాడుతున్న తహసీల్దార్ జరీనాబేగం

సత్యవేడు: ఓటర్ల నమోదు వేగవంతం చేయాలని తహసీల్దార్ షేక్ జరీనాబేగం అన్నారు. మంగళవారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష నాయకులతో ఓటర్లు నమోదుపై ఆమె సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ నియోజవర్గపరిధిలో రెండు వారాల్లో 7,814 అర్జీలు అందయన్నారు. నియోజవర్గంలో 74,653 ఇళ్లు ఉన్నాయన్నారు. వీటిలో ఇప్పటికే 11,001 ఇళ్లల్లో ఓటర్ల పరిశీలన జరిగిందన్నారు. 279 బూత్‌లకు 27 మంది సూపర్‌వైజర్లను నియమించామన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి, ఆరూరు శేఖర్, సర్పంచ్ శేఖర్, రమణయ్య, బీజేపీ మోహన్‌బాబు, సీపీఎం అరుణాచలం, టీడీపీ దిలీప్, గోవింద్ పాల్గొన్నారు.

కనుల పండువగా ఊంజల్‌సేవ



ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పౌర్ణమిని పురస్కరించుకుని ఊంజల్‌సేవ కనులపండువగా జరిగింది. మొదట ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఊరేగింపుగా స్వామి, అమ్మవారిని ఊంజల్‌సేవ మండపానికి తీసుకొచ్చారు. వేదమంత్రోచ్ఛరణల మధ్య ఊంజల్‌సేవ జరిగింది. వెన్నెల కాంతుల్లో ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





ధ్వజస్తంభం వద్ద సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, సినీనటుడు తనికెళ్ల భరణి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రముఖ సినీనటుడు తనికెళ్లభరణి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

వేడుకగా మహా చండీహోమం

తిరుపతి కల్చరల్: శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం మహా చండీహోమం వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండంలో పూజలు చేపట్టి చండీహోమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ కట్టా గోపియాదవ్, ఈఓ మునికృష్ణయ్య, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రేణిగుంట విద్యార్థుల ప్రతిభ



విజేతలతో హెచ్ఎం విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు

రేణిగుంట: రేణిగుంట జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు 3వ రాష్ట్రస్థాయి జీఎల్, ఎస్‌జీఎల్, గ్రాప్‌లింగ్ వ్రెస్టిలింగ్ పోటీల్లో ప్రతిభ చూపినట్లు పాఠశాల హెచ్ఎం విష్ణువర్ధనం, జిల్లా గ్రాప్‌లింగ్, వ్రెస్టిలింగ్ సంఘం అధ్యక్షురాలు ఏజీ రేఖారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 29, 30 తేదీల్లో అనకాపల్లిలోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాల్లో 18 బంగారు, 6 రజిత, 3 కాంస్య పతకాలను కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఆగస్టులో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

కర్ణాటక డిప్యూటీ సీఎంతో ఎమ్మెల్యే బియ్యపు మధు



ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు

శ్రీకాళహస్తి: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్‌కు ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు.

కడప ఉక్కు సాధనకు కలిసి రండి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

శ్రీకాళహస్తి: రాయలసీమ జిల్లాల హక్కు–కడప ఉక్కు పరిశ్రమ సాధనకు అన్ని రాజకీయ పార్టీలు కలిసిరావాలని సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. కడప ఉక్కు పరిశ్రమ స్థాపన సాధ్యం కాదన్న కేంద్రమంత్రి నిత్యానందరాయ్ మాటలను నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమకు బీజేపీ తీరని ద్రోహం చేస్తోందని మండిపడ్డారు. రాయలసీమ జిల్లాలకు ఒక కేంద్ర పరిశ్రమ కూడా లేకుండా మొండి చెయ్యి చూపుతోందన్నారు. కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కాదని, స్థాపన సాధ్యం కాదని కేంద్రమంత్రి చెప్పడం హాస్యాస్పదమన్నారు. కడప ఉక్కు పరిశ్రమ లాభదాయకం కానపుడు జిందాల్ కంపెనీకి ఎలా లాభాన్ని చేకూరుస్తుందని ప్రశ్నించారు. రాయలసీమ జిల్లాలకు తలమానికంగా నిలుస్తుందనుకున్న మన్నవరం బెల్‌ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందన్నారు. రాయలసీమకు బీజేపీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుంటే రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు ఎందుకు నిలదీయడం లేదని ధ్వజమెత్తారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దాసరి జనార్ధన్, గంధం మణి, పెనగడం గురవయ్య, నాగరాజు, కుమార్, వెలివేంద్రం, రాజా, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సొరకాయలస్వామి



విశేష అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

నారాయణవనం: మండలంలోని ఆలయాల్లో మంగళవారం పౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు. సొరకాయలస్వామి ఆలయంలో ఉదయం మూలవర్లక ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. శింగిరికోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలో ధన్వంతరి, లక్ష్మీ హోమాలను నిర్వహించారు. అనంతరం శ్రీదేవీ భూదేవి సమేత లక్ష్మీ నరసింహస్వామికి కల్యాణా న్ని నిర్వహించారు. కైలాసనాథకోనలోని శివశక్తి, శాంతి ఆశ్రమంలో పౌర్ణమి పూజలను నిర్వహించారు.

మేత బీడుభూమిని కేటాయించాలని ఆందోళన



మేత బీడు భూముల వద్ద ఆందోళన చేస్తున్న కొల్లడం రైతులు

సత్యవేడు: శ్రీసిటీ స్వాధీనంలోని 33 ఎకరాల మేత బీడు భూమిని కొల్లడం గ్రామానికి కేటాయించాలని రైతులు ఆందోళన చేశారు. మంగళవారం కొల్లడం గ్రామ రైతులు శ్రీసిటీ స్వాధీనంలోని మేత బీడు భూముల్లో దుక్కిలు దున్నేందుకు సన్నద్ధమయ్యారు. మేతబీడు, పోరంబోకు భూములను ఐదేళ్ల క్రితమే అప్పట్లో ఏపీఐఐసీ ద్వారా శ్రీసిటీకి అప్పగించారు. గ్రామపరిధిలోని 33ఎకరాలకు పైగా మేత బీడు భూమి ఉందని స్థానిక రైతులు కే. నిరంజన్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గ్రామంలోని జీవాలకు మేత కోసం ఈ భూమి అవసరం ఉందన్నారు. అప్పట్లో ప్రజాభిప్రాయం సేకరించకనే శ్రీసిటీకి భూములు అప్పగించిన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. శ్రీసిటీ స్వాధీనంలోని భూమిని తమ గ్రామానికి కేటాయించాలని ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న శ్రీసిటీ అసిస్టెంట్ జీఎం భానుప్రకాష్‌రెడ్డి, శ్రీసిటీ భద్రతాధికారి రమేష్‌కుమార్, డీఎస్పీ జగదీశ్‌నాయక్, సీఐ భాస్కర్ సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. భానుప్రకాష్‌రెడ్డి స్పందిస్తూ ప్రస్తుతం శ్రీసిటీ పరిధిలోని 17 గ్రామాల్లో మేతబీడు, పోరంబోకు భూములు 2017లో ఏపీఐఐసీ ద్వారా శ్రీసిటీ తీసుకుందన్నారు. అప్పట్లో ఏపీఐఐసీ ప్రజాభిప్రాయ సేకరణ కూడా నిర్వహించిందన్నారు.

తల్లిపాలతో బిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం



వరదయ్యపాళెంలో ర్యాలీ

వరదయ్యపాళెం: తల్లి పాలతోనే చంటిబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యమని వరదయ్యపాళెం, చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఉదయ్ కుమార్, లావణ్య పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీ ప్రాంతాల్లో ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించి, చంటిబిడ్డలకు తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మొండలెజ్ బాల్‌రక్షా భారత్ (సేవ్ ది చిల్డ్రన్స్ సంస్థ) వారు ఆశావర్కర్లతో ప్రత్యేక సమావేశమై పుట్టిన ప్రతి బిడ్డ తల్లిపాలు తీసుకునేలా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. వైద్యులు అనిత (చిన్న పాండూరు), ద్వైత (వరదయ్యపాళెం), సీహెచ్ఓ మధుసూదన్, పీహెచ్ఎన్ తులసమ్మ, సూపర్‌వైజర్ జయలక్ష్మి, బాల్‌రక్షా భారత్ సూపర్‌వైజర్లు కిరణ్‌కుమారి, సుబ్రమణ్యం, సిబ్బంది తులసి పాల్గొన్నారు.